శ్రీ పొట్టిశ్రీరాముల నెల్లూరు
వార్త



## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

### కోవూరు సెగ్మెంట్ పరిధిలో 2.12 లక్షల సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయం





**కోవూరు, మే 4 ప్రభాతవార్త :** ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయం అని ఆదిశగా ఆయన ముందుకు సాగుతున్నారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. నెల్లూరులోని తమ కార్యాలయంలో ఆదివారం కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఆరుగురికి 6,46,533 రూపాయలు విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 నెలల వ్యవధిలోనే 153 మంది అనారోగ్య బాధితులకు 2,12,73000 రూపాయల సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదే అన్నారు. అనారోగ్యం బారిన పడి కష్టాల్లో ఉన్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయం కొండంత అండగా నిలుస్తుందన్నారు. ఈ నిధుల ద్వారా వేలాది కుటుంబాలను ఆదుకుంటూ మానవత్వం చాటుకున్నారని ఈ సందర్భంగా ఆమె ముఖ్యమంత్రిని కొనియాడారు. ఈ పథకం ద్వారా నిరుపేదలకు ఆర్థిక భరోసా అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కోవూరు ప్రజానీకం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఇంతా మల్లారెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, మోర్ల మురళి, మాజీ ఎంపీపీ నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

## అతిరధులకు ఘన స్వాగతం



**వరికుంటపాడు, మే 4, ప్రభాతవార్త :** రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణ రెడ్డి,ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంఎల్ఎలు కాకర్ల సురేష్,ఉగ్ర నరసింహారెడ్డి,రాష్ట్ర ప్రభుత్వవిప్ కంచర్ల శ్రీకాంత్,ఎంఎల్‌సి బీదా రవిచంద్రలకు వరికుంటపాడు తెలుగుదేశంపార్టి కన్వీనర్ చంద్ర మధుసూదన్ రావు, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌యాదవ్,తెలుగుయువత అద్యక్షుడు ముజ్జె లక్ష్మీనారాయణల ఆద్వర్యంలో ఘన స్వాగతం



పలికారు.మండలంలోని ధర్మవరం గ్రామంలో అతిరధులకు తెలుగుయువత అద్యక్షుడు ముజ్జె లక్ష్మీనారాయణ,మండలపార్టి కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావునేతృత్వంలో అతిరధులకు మేళ,తాళాలు,టపాసుల మోతల నడుమ గజమాలతో ఘన స్వాగతం పలికారు.అనంతరం చత్రపతి శివాజి కాంస్య విగ్రహానికి పూల మాలలువేసి నివాళులర్పించారుఈసందర్భంగ స్థానికులు అతిరదులను చత్రపతి శివాజి గుర్తుగ తలపాక చుట్టి వీరఘడ్గం అందజేశారు.నేతలు ఆఖడ్గాన్ని చూపుతు చత్రపతి శివాజి వీరత్వాన్ని చాటిచెప్పారు.అనంతరం తెలుగుదేశంపార్టి వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.ఈకార్యక్రమంలో మాజి ఎంఎల్ఎ కంభం విజయరామిరెడ్డి,మాజి జటప్పి చైర్మన్ చెంచల్‌బాబుయాదవ్,జటప్పిటిసి సభ్యుడు రావెళ్ళ నాగేంద్ర,స్థానిక నేతలు జాజం హజరత్,నారాయణ,ముజ్జే మస్తాన్,పొనిగపోగు వెంగయ్య,వివిద గ్రామాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ బీదను మర్యాదపూర్వకంగా కలిసిన గంగోటి



**నెల్లూరు, మే 4, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) చైర్మన్‌గా నియమితులైన గంగోటి నాగేశ్వరరావు.. శాసనమండలి సభ్యులు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రను నెల్లూరు నగరం, మాగుంట లేఅవుట్‌లోని వారి నివాసం నందు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గంగోటికి బీద శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బీద్‌ను గంగోటి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు.

## కావలిలో పలు చెరువుల పై విజిలెన్స్ అధికారులు తనిఖీలు



**కావలిరూరల్, మే 4 ప్రభాతవార్త** కావలిరూరల్ మండలం చలంచర్ల, కావలి పట్టణ పరిధిలోని మందాటి చెరువు, పాపిరెడ్డి చెరువులను విజిలెన్స్ డీఈ మహితారెడ్డి తన బృందంతో పరిశీలించి తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఈ చెరువులు గతంలో ప్రపంచ బ్యాంకు నిధులతో పనులు చేపట్టడం జరిగింది. ఈ చెరువుల పనులను విజిలెన్స్ డీఈ క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది. ఈ తనిఖీలలో విజిలెన్స్ ఎఇ అవినాష్‌రెడ్డి, కావలి ఇరిగేషన్ ఎఇ కిరణ్‌లు పాల్గొన్నారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, మే4 ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం సాయంత్రానికి 0 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయంలో 50.874టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 50, ఎన్ఎఫ్‌సికి 30, పెన్నా డెల్టాకు 1030, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 96.466 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## అభివృద్ధిని వైఎస్సార్‌సీపీ అటకెక్కించింది

### - మంత్రి నారాయణ



**నెల్లూరు, మే 4, ప్రభాతవార్త-వైద్యం** వ్యక్తులపై అక్రమ కేసులు బనాయించడంపై పెట్టిన శ్రద్ధతో పదో వొంతు దృష్టి కూడా విద్యాలయాలపై వైసీపీ ప్రభుత్వం పెట్టలేదని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. ఐదేళ్ల పాటు సాగిన జగన్ సర్కార్ అస్తవ్యస్థ పాలనతో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారైందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో మూతపడ్డ వీఆర్ హైస్కూల్‌ని ఆధునీకరించి నిరుపేద విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తామన్నారు. ఆదివారం సాయంత్రం మంత్రి నారాయణ వీఆర్‌సీ పాఠశాల పునర్నిర్మాణ పనులను కమీషనర్ నందన్‌తో కలిసి పరిశీలించారు. అన్ని తరగతి గదులను పరిశీలించి తగు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ విద్యార్థుల ఆట పాటలకు అనుకూలంగా గ్రౌండ్‌లో ఉన్నటువంటి పాత శిధిలమైన భవనాలను తొలగించి మైదానాన్ని నిర్మిచాలని ఆదేశించామన్నారు. నెల్లూరు నగర బొడ్డులో మూడు షిఫ్టుల్లో 8 వేలకు పైగా విద్యార్థులు చదువుకున్న ప్రతిష్టాత్మక కాలేజీని గత ప్రభుత్వ నిర్వాహకులు నిర్వీర్యం చేశారన్నారు. గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విధంగా పాఠశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి నగరంలోని పేదలు, నిరుపేదలకు ఉన్నత స్థాయి విద్యను అందిస్తామన్నారు. ఎన్ఎంసీ కంపెనీ ఆధ్వర్యంలో పునర్నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. అన్ని పనులు అనుకున్న విధంగా పూర్తి చేసి వచ్చే విద్యాసంవత్సరం పాఠశాలలు ప్రారంభించే నాటికి పూర్తి స్థాయిలో సిద్ధం చేస్తామన్నారు. మొదటి సంవత్సరంలో వేయి మంది పేదలకు అడ్మిషన్స్ కల్పిస్తామని, ఉచిత బస్సు, భోజన వసతితో పాటు సాయంకాలం ఆటపాటల అనంతరం స్నాక్స్ అందించి వారి ఇళ్ల వద్ద దించుతామన్నారు. ఆ విధంగా వచ్చే విద్యాసంవత్సరం పేదల అడ్మిషన్లు రెండు వేలకు పెంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, నగర టీడీపీ అధ్యక్షులు మామిడాల మధు, స్థానిక కార్పొరేటర్లు, టీడీపీ నేతలు, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.


## అమ్మవారి అండదండలతో రాష్ట్రాభివృద్ధి



**వరికుంటపాడు, మే4, ప్రభాతవార్త:** మండలంలోని పెద్దిరెడ్డిపల్లి గ్రామంలో నూతనంగ అత్యంత ప్రతిష్టాత్మకంగ నిర్మించిన శ్రీశ్రీ అంకాళమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి,నెల్లూరు పార్లమెంటుసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్,కనిగిరి శాసనసభ్యుడు ఉగ్ర నరసింహారెడ్డి,ఎంఎల్‌సిలు బీదా రవిచంద్ర, కంచర్ల శ్రీకాంత్‌లు అమ్మవారి సన్నిదికి చేరుకొని గ్రామ దేవత అంకాళమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు.గ్రామ పెద్దలు, పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అదే గ్రామంలో విపిఆర్ అమృతధారలో భాగంగ విపిఆర్ ఫౌండేషన్ ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంటును మంత్రి ఆనం రామనారాయణరెడ్డి,ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,ఎంఎల్ఎలు కాకర్ల సురేష్,ఉగ్ర నరసింహారెడ్డి, ఎంఎల్‌సిలు బీదా రవిచంద్ర,కంచర్ల శ్రీకాంత్‌లు ప్రారంభించారు.అనంతరం మహిళలకు బిందెలతో నీటినిఅందజేశారు.ఈకార్యక్రమంలో మాజి ఎంఎల్ఎ కంభం విజయరామిరెడ్డి,మాజి ఎంఎల్ఎ కొమ్మి లక్ష్మీనాయుడు,మండలపార్టి కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు, మాజి జటప్పి చైర్మన్ చెంచల్ బాబు యాదవ్,నాయకులు ముజ్జే లక్ష్మీనారాయణ, నాదెండ్ల రాజేంద్ర,పోలుబోయిన శ్రీకాంత్‌యాదవ్, ఎంఎల్ఎ పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య, కాకర్ల వెంకట్,జటప్పిటిసి రావెళ్ళ నాగేంద్ర,వివిద గ్రామాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

## కోవూరు డెల్టాకు నీరు విడుదల చేసిన ఎమ్మెల్యే





**బుచ్చి మే 4 ప్రభాతవార్త** కోవూరు నియోజకర్గం రైతాంగం నార్లు పోసుకునేందుకు కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని కనిగిరి రిజర్వాయర్ వద్ద ఈస్ట్రన్ ఛానల్ నుండి 150 క్యూసిక్కులు నీటిని విడుదల చేశారు.మొదట గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించి అనంతరం నీటిని విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు నీటి విడుదల రోజే వరుణదేవుడు కరుణించడం ఎంతో శుభప్రదమని అన్నారు. గత సంవత్సరం రైతులు అదిక దిగుబడులు సాధించారని రెండో కారులో కూడా మంచి దిగుబడులు సాధించాలని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడు లేని విధంగా ధాన్యం అమ్మిన 24 గంటలలో నే హమాలీ చార్జీలుతో సహ ఖాతాలో జమచేయడం జరిగిందని అన్నారు ఆమె చంద్రబాబు నాయు డుకి ప్రత్యేకంగా ధన్య వాదాలు తెలిపారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని అన్నారు. చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని ఆమె తెలిపారు. కోవూరు నియెజకర్గంలో ఈస్ట్రన్ ఛానల్ 40 వేల ఏకరాలకు ,సదరన్ ఛానల్ 30 వేల ఏకరాలకు నీటిని ఇస్తున్నట్లు తెలిపారు.సదరన్ ఛానల్ కింద కూడా ప్రస్తుతం 100 క్యూసిక్కులు నీటిని విడుల చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో పెన్నాడెల్టా చైర్మన్ జెట్టి రాజ్‌గోపాల్‌రెడ్డి, సీనియర్‌నాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి,మున్సిఫల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, జొన్నవాడ దేవస్ధానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు, విజం రామానాయుడు , ఏటూరు శివరామకృష్ణారెడ్డి , నీటి సంఘం అద్యక్షులు బత్తల హరికృష్ణా,ఎం.వి శేషయ్య , మోర్ల మురళీ కౌన్సిలర్లు పుట్టా లక్ష్మీకాంతమ్మ, తాళ్ళ వైష్ణవి, కోటంరెడ్డి లలితమ్మ, చీర్ల ప్రసాద్, సూరా శ్రీనివాసులురెడ్డి,రాష్ట్ర చేనేత డైరక్టర్ తాళ్ళ నరసింహస్వామి, ఇప్పగుంటసుధాకర్‌రెడ్డి, ఇరిగేషన్ డిఇ పెంచలయ్య, కనిగిరి రిజర్వాయర్ ఇరిగేషన్ ఏఇ ప్రసాద్, కోవూరు ఇరిగేషన్ ఏఇ శ్రీనివాసులు, వవ్వేరు నాయకులు శివయ్య,శ్రీకాంత్‌రెడ్డి, పాల్గొన్నారు.



## ఖాళీ స్థలాలపై చోటా నేతల కన్ను



**కోవూరు, మే 4 ప్రభాతవార్త :** మండలంలోని పలు ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలపై పలువురు చోటా నేతల కన్ను పడింది. గత రెండు సంవత్సరాలకు పైగా ఈ స్థలాలు నిరుపయోగంగా ఉండడంతో వాటిని కొంతమంది రెవెన్యూ సహకారంతో ఆ స్థలాలపై చోటా నేతలు కన్ను వేశారు. దీంతో గుమ్మలదిబ్బ ప్రాంతంలో ఒక్కసారిగా రేట్లు అమాంతంగా పెరిగిపోయాయి. గతంలో అతి తక్కువ రేట్లు ఉన్న ఈ స్థలాల విలువ ప్రస్తుతం భారీస్థాయికి చేరుకోవడంతో ఈ చోటా నేతలకు సంతోషంగా ఉంది. గుమ్మలదిబ్బ ప్రాంతంలో ఒక అధికారి పార్టీ నేత పంచాయతీకి సంబంధించిన కాలువపై దర్జాగా కొట్లు నిర్మిస్తున్నా ఇటు రెవెన్యూ, అటు పంచాయతీ అధికారుల్లో ఇసుమంతైనా స్పందన లేకపోవడం గమనార్హం. దీనిని ఆసరాగా తీసుకుని పలువురు చోటా నేతలు గుమ్మలదిబ్బ, నందలగుంట, చెర్లో గాంధీ సంఘం ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలపై కన్ను పడింది. ఈ నేపథ్యంలో వాటిని ఏ విధంగా అయినా అమ్మేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఎ ధీమాతో ఈ చోటా నేతలు యదేచ్ఛగా అక్రమ కార్యక్రమాలకు తెరతీశారు. ఫలితంగా ప్రభుత్వం స్థలాలకు భారీ డిమాండ్ ఏర్పడింది. 2014 నుంచి 2019 వరకు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్న సమయంలో ఈ ప్రాంతంలో ఇచ్చిన లేఅవుట్‌లో ఇంకా పలు స్థలాలు ఖాళీగా ఉన్నాయి. అనంతరం 2019-2024 వరకు వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన కాలనీల్లో కూడా పలు స్థలాలు నేటికీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఇటువంటి వాటిపై ఈ చోటా నేతల కన్ను పడింది. దీంతో వారు దొంగ పత్రాలను సృష్టించి ఈ స్థలాలను ఖాళీ చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి కాలనీల్లో ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాలు గుర్తించి వాటిని అర్హత కలిగిన నిరుపేదలకు అందించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. స్థానిక గుమ్మలదిబ్బలో పంచాయతీ కాలువపై కొట్లు కడుతున్నారు అనే విషయమై కోవూరు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావును వివరణ కోరగా.. తాము ఆ పనిని ఆపేందుకు వెళ్తే ఆ నేత తమకు ఎమ్మెల్యే ఆర్డర్ ఇచ్చారని తమకు చెప్పడం. అందుకు ఇక్కడ కొట్లు కట్టుకుంటున్నామని చెప్పడం కొసమెరుపు.

## అమృతపథకం పైలాన్ ధ్వంసం కేసులో నలుగురు అరెస్ట్

### టూటౌన్ సిఐ గిరిబాబు



**కావలి, మే 4 ప్రభాతవార్త** కావలి పట్టణ ఎఎం బేకరికి ఎదురుగా ఉన్న అమృతపథకం పైలాన్ ధ్వంసం కేసులో నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు కావలి టూటౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ గిరిబాబు ఆదివారం తెలిపారు. దీనికి సంబంధించి వివరాలు అందచేశారు. తెలుగుదేశం పాలనలో కేంద్రం నిధులతో ఆనాటి మంత్రి నారా లోకేష్ అమృతపథకం పైలాన్‌కు శంకుస్థాపన చేశారు. వైసిపిపాలనలో అమృతపథకం పైలాన్‌ను 2020 ఎప్రిల్ 11వ తేది ధ్వంసం చేశారు. ఆనాడు కావలిలో పనిచేసిన మున్సిపల్ కమీషనర్ కె.వెంకటేశ్వరరావు ఫిర్యాదును పురస్కరించుకుని టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ కేసులో ఇప్పటికి 12 మందిని గుర్తించినట్లు సిఐ గిరిబాబు తెలిపారు. వారిలో నలుగురిని ప్రస్తుతం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఆరెస్ట్‌చేసిన వారిలో సాక్షి విలేకరి కుర్రు శ్రీనివాసులు (కెయస్), విలేకరి బెహరా వెంకటలక్ష్మినారాయణ, విలేకరి కేదారి కొండయ్య, వాణెంబాడి ప్రసాద్‌లను ఆరెస్ట్ చేసినట్లు టూటౌన్ సిఐ గిరిబాబు తెలిపారు. అమృతపథకం పైలాన్ ధ్వంసం జరిగిన సంఘటనలో కావలిలో ఉద్యమాలు, నిరసనలు చేపట్టి గందరగోళం సృష్టించిన వైనం తెలిసిందే.



## చలివేంద్రంను ప్రారంభించిన ఎమ్మెల్యే





**కందుకూరు, మే 4, ప్రభాతవార్త** వేసవి కాలం దృష్ట్యా ప్రజల కొరకు పట్టణ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యం లో పామూరు రోడ్డు ఎన్టీఆర్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంను ఆదివారం ఉదయం కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా ప్రజల కోసం పట్టణ టీడీపీ అధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయ మని తెలిపారు. పట్టణ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని మంచి సేవా కార్యక్రమాలు చేయాలని పట్టణ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే సూచించారు. చలివేంద్రం ప్రారంభించిన తర్వాత ఏర్పాటు చేసిన మజ్జిగను ఎమ్మెల్యే ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, ముచ్చు శ్రీను, పార్టీ నాయకులు చిలకపాటి మధుబాబు, షేక్ రఫీ, బెజవాడ ప్రసాద్, వడ్డెళ్ళ రవిచంద్ర, అత్తంటి శ్రీహరి నాయుడు, ముచ్చు వేణు, చుండూరి శ్రీను, మోదడుగు వెంకటేశ్వర్లు, కొత్తూరి వెంకట సుధాకర్, చీదెళ్ల వేణు, పున్నం వీరాస్వామి, మేడ మల్లిఖార్జున, ఉన్నం కొండలరావు, పీలా శ్రీను, ముప్పవరపు వేణు, అత్తింటి శివకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

## తోటపల్లిగూడూరు మండలంలో

### ఒక్క సారిగా మారిన వాతావరణం



**తోటపల్లిగూడూరు, మే 4, ప్రభాతవార్త** ఆదివారం ఉదయం నుంచి తోటపల్లిగూడూరు మండలంలో తీవ్ర ఉక్కపోతతో మండుతున్న ఎండలతో ప్రజలు ఇళ్లల్లో నుంచి బయటకి రావాలంటే భయపడ్డారు. అలాంటి తరుణంలో తోటపల్లిగూడూరు మొత్తం ఒక్క సారిగా వాతావరణం చల్లబడి చల్లటి ఈదురు గాలులు చిన్నపాటి చినుకులు పడుతుండడంతో ప్రజలు ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. గత 15, 20 రోజులుగా ఎండలు తీవ్రంగా కాయడంతో ప్రజలు ఇళ్లల్లో నుంచి బయటకు రావాలంటేనే భయపడిన పరిస్థితులు. ఇప్పుడు మే నెల రావడంతో ఎండలు తీవ్రత ఎక్కువగా ఉంటుందని పిల్లలు వృద్ధులు ఎలా ఉండాలి అని భయపడుతున్న తరుణం అధికాక వాట్సప్, ఫేస్‌వాతావరణ శాఖ ద్వారా మే నెలలో ఎండలు విపరీతంగా ఉంటాయని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ పలుమార్లు హెచ్చరించడం ప్రజలలో ముఖ్యంగా విధులలో ఒక విధమైన భయానక వాతావరణం కనిపించింది. అయితే ఆదివారం మధ్యాహ్నం 3గంటల నుంచి ఒక్క సారిగా వాతావరణం చల్లబడిపోయి చల్లటి గాలులు అలాగే సన్నపాటి చినుకులు పడుతుండడంతో ప్రజలు ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. ఈ వాతావరణం ఒక్క సారిగా మారిపోయి చల్లదనాన్ని ఇస్తుందని ఇది ఇలా ఆనందదాయకమని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ వేసవి కాలంలో వాతావరణం ఇలా ఒక్క సారిగా మారడం వల్ల సున్నా కారుకు నార్లు పోసుకుని యాతకు రెడీ అవుతున్న రైతులకు ఎంతో మేలుగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏదీ ఏమైనా వాతావరణం ఒక్క సారిగా చల్లబడడంతో ఇటు రైతులు, అటు ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## గ్రంథాలయాలకు రావడం ద్వారా విజ్ఞానం పెరుగుతుంది

### - గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు




**ఉలవపాడు, మే 4, ప్రభాతవార్త** ప్రతి రోజు గ్రంథాలయానికి రావడం ద్వారా విజ్ఞానం పెరుగుతుందని ఉలవపాడు శాఖ గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నీతి కథలు, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు, విజ్ఞాన దాయకమైన పుస్తకాలు చదివించి అనంతరం లెమన్ అండ్ స్పూన్ ఆటల పోటీలు నిర్వహించిన అనంతరం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో విద్యార్థులకు కూల్ డ్రింక్ అందజేయడం జరిగిందని గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు తెలిపారు. వేసవి శిక్షణా తరగతులలో భాగంగా ఆదివారం 26 మంది విద్యార్థులను గ్రంథాలయానికి పంపించిన వారి తల్లిదండ్రులకు గ్రంథపాలకుడు కృతజ్ఞతలు తెలిపారు.

## 7న మండల సర్వసభ్య సమావేశం



**ఉలవపాడు, మే 4, ప్రభాతవార్త** ఉలవపాడు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 7వ తేదీన మండల పరిషత్ కార్యాలయం నందు జరుగుతుందని ఎంపీడీఓ ఎన్.విజయ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వాయల మస్తానమ్మ ఆధ్వర్యంలో 7వ తేదీ బుధవారం మధ్యాహ్నం 2గంటలకు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. కావున అధికారులు అందరూ సమగ్ర నివేదికతో హాజరు కావాలని సూచించారు. అఆగే సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీ, జడ్పీటీసీలు హాజరు కావాలని ఎంపీడీఓ ఎన్.విజయ కోరారు.

# నాటి చెంచులకోనే..నేటి పెంచలకోన

## 8 నుండి 14 వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలు





**పెంచలకోన(రాపూరు), మే4ప్రభాతవార్త** పూర్వం చెంచులకోనగా వున్నక్షేత్రమే కాలక్రమేణా పెంచల కోనగా మారింది. దక్షిణ భారతదేశంలోని ప్రముఖ వైష్ణవ క్షేత్రాలలో ఒకటిగా, నవనారసింహ క్షేత్రాల లో ఒకటిగా పెంచలకోన పేరుగాంచింది. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణకై శ్రీ మహావిష్ణువు ప్రహల్లాదుని పిలుపు మేరకు స్థంబం నుండి ఉగ్రనరసింహ మూర్తిగా ఉద్భవించి హిరణ్య కశపుడిని వధించిన అనంతరం కోపంతో అనేక దట్టమైన అడవీ ప్రాంతాల లో భీకరంగా గర్జిస్తూ సంచరించినట్లు పూరాణాలు చేపుతున్నాయి. అలా సంచరిస్తూ ఆయన ఈ ప్రాంతంలో వుండగా చెంచురాజు కుమార్తె అయిన చెంచు లక్ష్మీ తన చెలికత్తేలతో కలసి అడవులలో విహారానికి వెల్లగా అక్కడ భీకరమైన అకారంతో ఉగ్రరూపంతో వున్న స్వామి వారిని చూసిన చెంచు లక్ష్మీ చెలికత్తేలు భయపడి పారిపోగా చెంచులక్ష్మీ మాత్రం ఎటువంటి భయం లేకుండా తదేకంగా స్వామి వారిని చూస్తూ పరవిచించడం చూసిన స్వామి వారు ప్రసన్నునడై ఉగ్రరూపం వదిలి ఆమెతో చెలిమి చెసి చెంచు రాజకు కప్పం చెల్లించి చెంచు లక్ష్మీని పరిణయమాడారు. అనంతరం ఆమెను పెన వేసుకోని ఇక్కడ శీలారూపం దాల్సినట్లు పురాణ కధనం. స్వామి వారిని వెతుకుకుంటూ భూలో కోనాకి వచ్చిన మహాలక్ష్మీ అమ్మవారు స్వామి వారు మరో వనితతో వుండటం చూసి ఆగ్రహించి స్వామికి అల్లంత దూరంలో కణ్వనది పై బాగాన శీలారూపం దాల్చిందని చెపుతుంటారు. అమ్మవారి ఆలయానికి పక్కనే వున్న వృక్షానికి ఉయల కడితే పిల్లలు లేని వారికి పిల్లలు పుడతారని భక్తుల నమ్మకం. అలా పిల్లలు కలిగితే వారికి పెంచలయ్య, పెంచలమ్మ అని నామకరణం చేస్తుంటారు.

**స్వామి వారి తోలిదర్శనం గోల్లబోయిన స్వామికే**

స్వామి వారు తన తోలిదర్శనాన్ని ఒక గోర్రెల కాపరికి ఇచ్చినట్లు చెపుతారు. ఈ గోర్రెల కాపరి గోర్రెలను మేపుకుంటూ అడవిలోకి వెల్లగా అక్కడ స్వామి వారు ఆయనకు దర్శనమిచ్చి తాను ఈ ప్రాంతంలో వున్నట్లు గ్రామస్తులకు తెలిపి తనకు ఆలయం నిర్మించాలని చెప్పి, గ్రామంలోకి వెల్లే వరకు వెనకకు తిరిగి చూడకుండా వెల్లాలని గోల్ల వానికి చెప్పగా, అలాగే నని చెప్పిన ఆ గోర్రెల కాపరి కాస్తా దూరం వెల్లినాగా ఉత్కంఠతతో వెనుకకు తిరిగి చూడటంతో అక్కడే ఆయన శిలగా మారినట్లు కధనం. తరువాత స్వామి వారు మరి కోందరికి స్వప్నంలో దర్శనమిచ్చి తాను ఈ ప్రాంతంలో స్వయంభువుగా వున్నట్లు తనకు ఆలయం నిర్మించాలని చెప్పగా సుమారు 850 సంవత్సరాల క్రింతం ఈ ఆలయం నిర్మించినట్లు తెలుస్తుంది. స్వామి వారి తోలి దర్శనం అనంతరం శిలగా మారిన గోర్రెల కాపరికి ఆయన శిల అయిన ప్రాంతంలోనే ఆలయం నిర్మించారు. ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాల సమయంలో స్వామి వారు ముందుగా ఈ గోల్లబోయిన స్వామి వారి ఆలయం వద్దకు చేరుకోని తోలి దర్శనం గోల్లబోయిన స్వామికే ఇస్తారు.ప్రతి ఏడాది వైశాఖ మాసంలో శుద్ధ ఏకాదశి నుండి వైశాఖ బహుళ విదియ వరకు స్వామి వారికి బ్రహ్మోత్సవాలు 6 రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.

**మే నెల 8నుండి 14 వరకు బ్రహ్మోత్సవాలు**

స్వామి వారి బ్రహ్మోత్సవాలలో బాగంగా మే నెల 8 వ తేది స్వామి వారిని స్వామి వారిని గోను పల్లి నుండి కాలినడకన పల్లకీపై కోనకుతీసుకువస్తారు. సాయంత్రం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ నిర్వహిస్తారు. 9వ తేది స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఎటువంటి అటంకాలు లేకుండా జరిగేందుకు ధ్వజారోహన, అనంతరం శేషవాహన సేవ నిర్వహిస్తారు. 10వ తేది ఉదయం సరస్వతి అలంకారంలో స్వామి వారికి హంసవాహన సేవ, రాత్రి బంగారు హనుంత వాహన సేవ నిర్వహిస్తారు. 11వ తేది నృసింహ జయంతి సందర్భంగా ఉదయం సింహవాహన సేవ, రాత్రి బంగారు గరుడ వాహన సేవ నిర్వహిస్తారు. 12వ తేది ఉదయం స్వామి వారికి తిరుకళ్యాణం, సాయంత్రంరథోత్సవం, రాత్రి గజవాహన సేవ నిర్వహిస్తారు. 13వ తేది ఉదయం వసంతోత్సవం, చక్రస్నానం ,రారతి స్వామివారికి తెప్పోత్సోవం, అనంతరం అశ్వవాహన సేవ, రాత్రి స్వామి వారి బ్రహ్మోత్సవాల ముగింపుకు ధ్వజావరోహణం నిర్వహిస్తారు. 14వ తేది స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకిలో గోనుపల్లి గ్రామానికి తీసుకువచ్చి అక్కడ గ్రామోత్సవం నిర్వహిస్తారు.

**బ్రహ్మోత్సవాలలో సామాన్య భక్తులకు పెద్దపీత**



శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి వారి బ్రహ్మోత్స వాలలో ఈ పర్యా యం వెంకటగిరి ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ ఆద్వర్యంలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచనల మేరకు సామన్య భక్తులకు స్వామి వారి దర్శనం సులభతరంగా జరిగేలా చర్యలు తీసుకోని బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహస్తామని బ్రహ్మోత్సవాల సేవా కమిటీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి తెలిపారు.

**పూర్తి కావచ్చిన ఏర్పాట్లు** స్వామి వారి బ్రహ్మోత్సవాలకు సం బందించి ఇప్పటకే ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుత న్నాయని ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివా సుల రెడ్డి తెలిపారు. క్యూలైన్‌లలో తోపులాటలు లేకుండా వుండేలా క్యూలైన్‌ల ఏర్పాటుతో పాటు భక్తులకు నిరంతం తాగునీటి సరఫరా చేస్తామన్నారు. దీంతో పాటు భక్తుల సౌకర్యార్థం అన్ని చర్యలు చెపట్టి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేస్తామని తెలిపారు.




# విజయవంతంగా ఉచిత ఆయుర్వేధిక వైద్య శిభిరం

**రాపూరు, మే4ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరులోని సి.వి.కె.ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిభిరం విజయవంతమైంది. బెంగుళూరులోని స్కంద ఆయుర్వేదలాయం వారి సహకారంతో నిర్వహించిన ఈ శిభిరంలో ఆయుర్వేధిక వైద్యులు పాల్గోని రోగులకు వైద్య పరిక్షలను నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మండలంలో మరిన్ని ఉచిత వైద్య శిభిరాలను నిర్వహించి పేదలకు వైద్య సేవలు అందించనున్నట్లు వైద్యశిభిరం నిర్వహకుడు సైదాపురం మండలం, పోతేగుంట గ్రామానికి చెందిన ఆయుర్వేదిక వైద్యుడు డాక్టర్ కడివేటి లోకేష్ తెలిపారు. పెంచలకోన దేవస్థానం బ్రహ్మోత్సవాల సేవా కమిటీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి ఈ శిభిరాన్ని సందర్శించారు. ఈయన వెంట టిడిపి నాయకులు నల్లవడ్ల వెంకట రమణా రెడ్డి, మూరంరెడ్డి మధుసూధన్ రెడ్డి, జనసేన నాయకుడు గుండు రాఘవయ్య, వైద్యశిభిరంలో ఆయుర్వేదిక వైద్యులు డాక్టర్ శేష సాయి, డాక్టర్ కడివేటి లోకేష్, డాక్టర్ సంజన, డాక్టర్ కౌశిక్ ,డాక్టర్ మిత్తు, డాక్టర్ భూవనేశ్వరిలు వున్నారు. వైద్యశిబిరాన్ని కడివేటి నారాయణ పర్యవేక్షించారు.



# నేడు రాపూరుకు ఉడిపి ఆడమూరు పీఠాదిపతి

**రాపూరు, మే4ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరుకు సోమవారం ఉడిపి ఆడమూరు పీఠాదిపతి శ్రీశ్రీశ్రీ ఈషాప్రియ తీర్ధ స్వామి వారు రానున్నట్లు నిర్వహికులు తెలిపారు. ఈ స్వామి ధర్మపరిరక్షణలో బాగంగా గోసంరక్షణ, గ్రామీణ చేతి వృత్తి వారి అభివృద్ధి కోరకు పాదయాత్ర చేస్తూ ఇందులో బాగంగా రాపూరు వస్తున్నారు. రాపూరులోని కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఉదయం పిఠ పూజ అనంతరం 9.30 నుండి 12 వరకు భక్తులకు అనుగ్రహ భాషణం నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపాం పెద్ద ఎత్తున భక్తులు పాల్గోని స్వామి వారి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు.,



# ముగిసిన అండర్-14 సౌత్‌జోన్‌టెన్నీస్ బాల్ క్రికెట్ ఛాంపియన్‌షిప్

## విజేతలుగా బాలుర విభాగంలోతమిళనాడు,బాలికల విభాగంలో ఆంధ్రరాష్ట్ర జట్లు

**నెల్లూరు, మే4 ప్రభాతవార్త-విద్య** గత రెండు రోజులుగా నగరంలోని స్దానిక ఏసీసుబ్బారెడ్డి క్రీడాప్రాంగణంలో జరుగుతున్న అండర్-14 సౌత్‌జోన్ టెన్నీస్‌బాల్ క్రికెట్ ఛాంపియన్‌షిప్-2025 పోటీలు ఆదివారంతో ముగిసాయి. చివరి రోజ ఉత్కంఠ బరితంగా సాగిన ఈ పోటీల్లో బాలుర విభాగంలో తమిళనాడు జట్టు విజేతగా నిలువగా ఆంధ్రప్రదేశ్ జట్టు రన్నర్‌గా నిలిచింది. బాలికల విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టు విజేతగా నిలువగా తమిళనాడు జట్టు రన్నర్‌గా నిలిచింది. ఈ సందర్బంగా ఆదివారం రాత్రి విజేతలకు బహుతుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతు టోర్నమెంట్ నిర్వహణకు సహాయ సహకారాలు అందించిన దాతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ పిట్టి మల్లికార్జున, జిల్లా టెనీస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు చెవెల యు గంధర్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ రంభ ప్రసాద్, కోట్ రేమేష్, సభ్యులు దేవిక, హేమంత్, అసోసియేషన్ జిల్లా నిర్వహణ కార్యదర్శి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.



## కళ్యాణం.... కమనీయం

### శ్రీ సీతారాముల కళ్యాణ వైభోగం

**సంగం మే 4 ప్రభాతవార్త** ముత్యాల తలంబ్రాలు..... మంగళవాయిద్యాలు.,..... వేదమంత్రోచ్ఛరణ నడుమ సంగం మండలం జంగాకండ్రిక గ్రామాలోని శ్రీకోదండ రామస్వామి ఆలయంలో వైభవంగా సీతారాముల కళ్యాణం జరిగింది. అర్చకలు శాస్త్రోక్తంగా శ్రీ సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున పాల్గోని స్వామి వారి కళ్యాణం తిలకించి పరవశించారు. కళ్యాణం అనంతరం భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందజేశారు. జై శ్రీరాం అంటు భక్తులు భక్తి పారవశ్యంతో రామ నామం జపించారు.



## రెండవ పంటకు నారుమడులు సిద్ధం



**విడవలూరు, మే 4, ప్రభాతవార్త:** రెండవ పంటకు రైతన్నలు నారుమడులు వేగవంతంగా సిద్ధం చేస్తున్నారు. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న గిట్టుబాటు ధర రైతులకు ఒక వరం అని మండలంలోని రైతులు ఇప్పటికే 70 శాతం నారుమడులు ఏర్పాటు చేశారు.

## యువనేస్తం పౌండేషన్ నేతృత్వంలో బ్లడ్ క్యాంపు




**సంగం మే 4 ప్రభాతవార్త** సంగం మండలం సిద్దీపురం గ్రామంలో యువనేస్తం పౌండేషన్ వారు ఫ్రీ బ్లడ్ క్యాంపు నిర్వహించారు. ఈకార్యక్రమం నిర్వాహకులుగా నాయర్ రసూల్, చంద్రకాంత్ వ్యవహా రించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సిద్దీపురం గ్రామానికి చెందిన వైద్య విద్యార్థి జీవన్ చంద్రారెడ్డికి నివాళుల ర్పించారు. ఈకార్యక్రమంలో యువనేస్తం పౌండేషన్ యువకులు పాల్గొన్నారు.

## నేడు కావలిలో మాజీ మంత్రి కలికి 19వ వర్ధంతి వేడుకలు

### వైసిపి పట్టణ అద్యక్షుడు కేతిరెడ్డి



**కావలి, మే 4 ప్రభాతవార్త** కావలి కలికితురాయి, మాజీ మంత్రి కలికి యానాదిరెడ్డి 19వ వర్ధంతి వేడుకలు కావలి పట్టణ మాగుంట పార్వతమ్మ ట్రంకురోడ్డులోని కలికి యానాదిరెడ్డి విగ్రహంవద్ద సోమవారం జరుగు తా యని వైసిపి పట్టణ అద్యక్షులు కేతి రెడ్డి శివకుమార్‌రెడ్డి తెలిపారు. ఉద యం 10 గంటలకు కలికి విగ్రహం వద్ద శ్రద్ధాంజలి ఘటించడం జరుగు తుందన్నారు. ఆ తర్వాత భోజన కార్యక్ర మాలు ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. కావలి నియోజకవర్గ, పట్టణ కలికి అభి మానులు, శ్రేయోభిలాషులు అందరూ తరలివచ్చి ఈ కార్యక్రమాల్లో పాల్గొని జయ ప్రదం చేయాలని కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి కోరారు.

## పది, ఇంటర్ ప్రతిభావంతులైన ఆర్యవైశ్య విద్యార్థులకు సన్మానం



**కావలి, మే 4 ప్రభాతవార్త** పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థులను కావలి ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. కావలి ఆ ర్యవైశ్యసంఘం కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రాసప్రవీణ అన్నదాత మణి ముఖ్యఅతిధిగా పా ల్గొని తనదైన ప్రాసలో విద్యార్థులను ఉత్తేజపరిచి మంచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆశీర్వ దించారు. ఆర్థికస్థోమత లేని పేద ఆర్యవైశ్య విద్యార్థుల ఉన్నత చదువులకోసం కావలి ఆర్యవైశ్యసంఘం అండగా ఉంటుందని సంఘం అద్యక్షులు తటవర్తి తెలిపారు. ప్రతి ఒక్క ఆర్యవైశ్య విద్యార్థి బాగా చదువుకుని ఉన్నతస్థానంలో నిలవాలని ఆర్యవైశ్యుల పేరు నిలబెట్టాలని ఆయన కోరారు. అత్యుత్తమ మార్కులు సా ధించిన 20 మంది విద్యార్థులను దుశ్శాలువాలతో సత్కరించి షీల్డులు, గిఫ్ట్‌లు అందచేశారు. ఈ కార్యక్ర మంలో తటవర్తి రమేష్ సతీమణి శిరీష, ఆర్యవైశ్యసంఘం నేతలు ఒరుగంటి రామకృష్ణ, ఒరుగంటి సురేష్, వేముల సునీల్, మంచిగంటి మురళి, గాదంశెట్టి మధు, కోట రమేష్, చెన్న కొండలరావు, సోమిశెట్టి ఉమ, సందీప్, గాదంశెట్టి వంశి, తదితరులు పాల్గొన్నారు.

## దామిశెట్టి కుటుంబసభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**కావలి, మే4 ప్రభాతవార్త** డిబియస్ ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్, వైసిపినేత దివంగత దామిశెట్టి శ్రీనివాసులునాయుడు కుటుంబ సభ్యులను కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి పరామర్శించారు. కావలి లోని దామిశెట్టివారి వీధిలోని నివాసానికి వెళ్లి దామిశెట్టి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు తన ప్రగాఢసానుభూతిని వ్యక్తం చేశారు. దామిశెట్టి సేవలను కొనియాడారు.

## ఆగని దళితులపై దాడులు అను వార్త కథనానికి స్పందించిన ఎస్సై వీరేంద్రబాబు



**తోటపల్లిగూడూరు, మే 4, ప్రభాతవార్త** శనివారం ఒక పొలం వివాదంలో జరిగిన ఘర్షణలో దళితులైన నక్క వివేక్ తరిమిటి ఉదయ్ కుమార్‌తో స్థానికంగా ఉన్న మన్యం కేశవులు మన్యం భార్గవ్, రావుల సురేష్, మన్యం శివ అనువాళ్లు ఉదయ్ కుమార్‌లతో గొడవపడ్డారని తోటపల్లి గూడూరు ఎస్సై వీరేంద్రబాబు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. గతంలో దండు వెంకట సుబ్బయ్య దగ్గర కోవెరపాలెం గ్రామంలో తనకున్న సొంత పొలాన్ని వివేక్ పేరుపై ప్లీజ్ అగ్రిమెంట్ చేశారు. అయితే శనివారం ఆ పొలంలోకి ఉదయ్‌కుమార్, వివేక్ పొలం పనులు చేసుకొనుచుండగా తోటపల్లిగూడూరు గ్రామానికి చెందిన మన్యం కేశవులు, మన్యం భార్గవ్, రావుల సురేష్, మన్యం శివ అనువాళ్లు వాళ్లతో పాటుగా మరో ఆరు మంది కలిసి పొలంలో పనులు చేసుకుంటున్న లీజు దారులైన వివేక్ ఉదయ్ కుమార్‌లను దుర్భాషలాడుతూ కులం పేరుతో బండబూతులు తిట్టి దాడి చేశారని రిపోర్ట్ అందిందని దీనిపై ఉన్నతాధికారులు సూచనలు మేరకు సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్సై వీరేంద్రబాబు తెలిపారు. అలాగే రిపోర్ట్ ఇచ్చిన ఇద్దరు బాధితులను పిలిచి ఏమి జరిగిందని అడిగి తెలుసుకున్నారు.

## సృజనాత్మకత కళ పెంపొందించుకోవాలి




**వింజమూరు, మే 4, ప్రభాతవార్త** వింజమూరు శాఖ గ్రంధాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న గ్రంధాలయ వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా ఆరవ రోజు పేపర్ ఆర్ట్ కార్యక్రమాన్ని గ్రంధాలయాధికారి జి. కొండయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు పేపర్‌పై ఆర్ట్ వేయడంపై పోటీలు నిర్వహించారు. విద్యార్థు లు ఒకరికొకరు పోటీలు పడి చిత్రాలు గీయడం చేశారు. పేపర్ ఆర్ట్ అనేది విద్యార్థి యొక్క మానసిక నైపుణ్యతపై ఆధారపడి ఉంటుంది. చురుకైన విద్యార్థి తన మనసును సమాజంపై మరల్చి సమాజంలో జరుగుతున్న ప్రస్తుత అంశాలను ఊహించుకొని ఆ అంశాలను సంఘటనగా మార్చుకొని చిత్రాన్ని గీయడం ఈ ఆర్ట్‌లోని గొప్పతనం ద్వారా విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడం జరుగుతుంది. తనలో ఉన్న నైపుణ్యతను తెలుసుకునే అవకాశం ఉంటుంది. కాబట్టి ఇలాంటి పోటీలు విద్యార్థి దశ నుండే అలవర్చుకున్నట్లయితే భవిష్యత్తులో మంచి కళాకారునిగా రాణించగలడు. కావున విద్యార్థులు చిన్నతనం నుండే పలు విభాగాలకు చెందిన నైపుణ్యతను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉన్నారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

**నెల్లూరు క్రైమ్, మే 4, ప్రభాతవార్త** : స్థానిక బుజబుజ నెల్లూరులో విజయ్ అనే దుండగుడు కత్తితో దాడి చేసిన ఘటనలో మహిళ చికిత్స పొందుతూ ఆదివారం మరణించారు. వివరాల్లోకి వెళితే.. బుజబుజ నెల్లూరుకు చెందిన మాబున్నీసా తన పిల్లలతో కలిసి వెళుతున్న సందర్భంలో అదే ప్రాంతానికి చెందిన విజయ్ అనే వ్యక్తి కత్తితో దాడికి దిగాడు. ఈ క్రమంలో తీవ్ర గాయాల పాలైన మాబున్నీసాను స్థానికులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం ఆమె మృతి చెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న వేదయపాలెం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఈదురు గాలులతో వర్షం



**విడవలూరు, మే 4, ప్రభాతవార్త** : మండలంలోని ఈదు రు గాలుల వర్షం కురవడంతో పలుచోట్ల చెట్లు నెలకు ఒరిగిపోయినాయి, అలాగే విద్యుత్ అంతర్యం కలిగింది. ఓ పక్కరెండవ పంటకు సంబంధించి రైతులు వర్షం కురవ డంతో హర్షం వ్యక్తం చేశారు. ఉరుములతో కురిసిన వర్షానికి ప్రజలు ఉలిక్కిపడ్డారు.

## అంకమ్మ తల్లికి విశేష పూజలు



విడవలూరు, మే 4, ప్రభాతవార్త: మండల కేంద్రంలో వెలసియున్న గ్రామ దేవత శ్రీ అంకమ్మ తల్లికి ఆదివారం అర్చకులు కొర్నగిరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం అభిషేకం, కుంకుమ అర్చన చేశారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. రాత్రి పూల అలంకరణ, పల్లకి సేవ కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేయడంతో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాలకు ఉదయకర్తలుగా భక్తులు వ్యవహరించారు.

## బొమ్మవరంలో తాగు,సాగునీరు అందక ఇబ్బందులు



**అనంతసాగరం,మే4,ప్రభాతవార్త:** మండలంలోని బొమ్మవరం గ్రామ పంచాయతీ అత్యంత కీలకమైందని అలాంటి బొమ్మవరం పంచాయతీలో తాగు,సాగునీరు అందక గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుగుదేశంపార్టీ యువ నేత రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆదివారం సోమశిల లో విలేకర్లతో మాట్లాడుతూ ఈ పంచాయతీకి సమీపంలో వేల ఎకరాలు ,సాగునీరు , తాగునీరు అందించే సోమశిల ఉత్తర కాలువ ఉన్న గ్రామ పంచాయతీ పరిధిలోని పంచాయతీ ప్రజలకు సాగు నీరు, తాగునీరు కు కష్టంగా మారిందన్నారు. గ్రామానికి వచ్చిన ప్రతి నాయకుడు సోమశిల ఉత్తర కాలువ నుండి ఎత్తిపోతల పథకం ద్వారా అంచనాలు తయారు చేయడం తప్ప పట్టించుకునే నాధుడే లేరన్నారు. బొమ్మవరంగ్రామ పరిధిలోని నీటి ఎద్దడిని నివారించేందుకుఏ ప్రభుత్వం ఎలాంటి ప్రతిపాదనలు సిద్ధం చేయలేదన్నారు. ఈగ్రామంలో మెట్టపైర్లు పండించడంలో జిల్లాలోనే పేరు సంపాదించిందన్నారు. ఎప్పుడూ కష్టాన్ని నమ్ముకొని బతికే రైతన్నల కన్నీరు చూస్తే ఆందోళన కలిగిస్తుందన్నారు. ఎంతోమంది పాలకులు మారుతున్నా ఈ పంచాయతీ పరిధిలో నీటికోసం అలమటిస్తున్న విషయం అందరికి తెలిసిందేనన్నారు. అసలే అంతంతమాత్రం వర్షాలు, దీనికి తోడు వేసవికాలం కావడంతో బోర్లు కూడా అడుగంటుతు న్నాయన్నారు. బోర్లు వేయాలంటే 500నుంచి 700అడుగులు లోతు వేసినా నీరు అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బొమ్మవరం చెరువును సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ కింద పరికించి గతంలో ప్రస్తుత మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రపోజల్ తీసుకురావడం జరిగిందని కానీ అప్పటి ప్రభుత్వం చివరి సమయంలో ఆచరణకు నోచుకోలేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి బొమ్మవరం పంచాయతీకి తాగు,సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## వైసిపి మండల కన్వీనర్‌గ ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి



**జలదంకి,మే4,ప్రభాతవార్త:**వైకాపా జలదంకి మండల నూతన కన్వీనర్‌గ ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి నియమింపబడ్డాడు. ఈమేరకు ఆపార్టీ నేడొక ప్రకటనలో తెలిపింది. గత కన్వీనర్ పాలవల్లి మాలకొండారెడ్డి రాజినామా చేయడంతో పలువురు మండల నేతలు కన్వీనర్ రేసులో వుండి ఎవరి ప్రయత్నాలు వారు చేశారు. ఆశావాహులు ఉదయగిరి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జ్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ని కలసి వారి మనోగతాన్ని వివరించి అవకాశం ఇవ్వవలసిందిగ కోరారు. రాజగోపాల్‌రెడ్డి అందరి విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకొని తగువిదంగ జల్లెడపట్టారు. చివరక ఇస్కావైపే మొగ్గుచూపి ప్రకటించినట్లు తెలుస్తుంది. యువకుడు అనుభవశాలి, మెరుగైన వ్యూహకర్త అయిన ఇస్కాని కన్వీనర్ పదవి వరించడంపై ఆయన అభిమా నులు, మద్దతుదారులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. జలదంకిలో ఆయనకు మంచిపట్టువుండడమే కాకుండ తన తండ్రి రాజకీయాలలో అపరచాణుక్యుడుగ కొనియాడబడిన ఇస్కా వెంకట్రామిరెడ్డి అడుగుజాడల్లో నడిచి మంచి చతురత కలిగిన యువనేతగ పేరుంది. ప్రస్తుత పరిస్థితులలో వైసిపి పార్టీని గాడిలో పెట్టగల సామర్థ్యం మదన్‌మోహన్‌రెడ్డికి వుందని తప్పక ఆయన సారద్యంలో పార్టీ పూర్వవైభవం సంతరించుకోవడం ఖాయమని పార్టీ వర్గాలు అంచనా వేస్తుండడం గమనార్హం. ఈసందర్బంగ పలువురు అబిమానులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

## గంగమ్మ కు ప్రత్యేక పూజలు



బిట్రగుంట మే 4(ప్రభాతవార్త) బోగోలు యాదవపాలెంకు నైరుతి దిక్కున గంగ తిప్ప మీద వెలిసి ఉన్న శ్రీ గంగమ్మ తల్లి ఆలయం వద్ద నెల్లూరు రావుస్ కాలేజి యాజమాన్యం ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి గంగమ్మ తల్లికి మొ క్కులు చెల్లించారు. .ఈ కార్యక్రమంలో రావుస్ కాలేజి యాజ మాన్యం యాదవపాలెం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గణనాదునికి ప్రత్యేక పూజలు



మనుబోలు మే 4 ప్రభాతవార్త మనుబోలు బిసి కాలనీలో వెలసి ఉన్న శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయం స్థాపించి మూడు సంవత్సరాలు గడిచిన సందర్భంగా స్వామి వారికి ప్రత్యేకాభిషేకాలు గణపతి పూజా స్వస్తి పుణ్యాహవచనం పంచసూక్త పారాయణం ఆదిత్యాది నవగ్రహపూజ పంచమాతాలతో వివిధ రకాల సుగంద ద్రవ్యాలు అభిషేకం ఆదివారం నాడు నిర్వహించడం జరుగుతున్నది. ఆలయ అర్చకులు శ్రీని వాసులు మామిడిపళ్ళతో అలంకరించి విశేషపూజలు నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమానికి ఉభయ దాతలుగా వరసిద్ధి వినాయక ఆలయ గణేష్ కమీటి సభ్యులు వ్యవహరించారు. కాలనీ వాసులు ఆదిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శిం చుకొని ప్రసాదాలు స్వీకరించారు.

## చినుకుపడితే విద్యుత్ కోతలే


**మనుబోలు మే 4 ప్రభాతవార్త** చినుగుపడితే చాలు మనుబోలు మండలంలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. ఈవిషయమై ప్రజలు తీవ్రంగా విమర్శలు చేస్తున్నారు. ఆదివారం సాయింత్రం కురిసిన చిన్నపాటి వానకి సాయింత్రం 4 నుండి విద్యుత్ సరఫరా నిలిపివేశారని రాత్రి 8 అవుతున్న విద్యుత్ ఇవ్వలేదని ఎప్పుడు ఇస్తారో కూడా తెలియడం లేదని ప్రజలు విద్యుత్ శాఖపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కానీ విద్యుత్ శాఖ వారు గూడూరు నుండి మరియు నెల్లూరు నుండి వచ్చే 33 కెవి విద్యుత్ లైన్ సమస్య తలెత్తిందని విద్యుత్ శాఖ వారు తెలిపారు. కానీ ప్రజలు మాత్రం విద్యుత్ శాఖకి ఇది పరిపాటి అని చిన్న చినుకుపడితే చాలు గంటలు,గంటలు విద్యుత్ కోతలు ఉంటున్నాయి. అని మండల ప్రజలు ఈ విషయంపై తీవ్రంగా విమర్శలు చేస్తున్నారు.

## అందరిని అలరించిన శాస్త్రీయ సంగీత కచ్చేరి




**కావలి, మే 4 ప్రభాతవార్త** వేదాంతం అనంతకృష్ణ ఆంజనేయశర్మ శాస్త్రీయ సంగీత కచ్చేరి అందరిని ఎంతగానో అలరించింది. కావలి పాతవూరు శివాలయం శంకరమఠంలో శ్రీజగద్గురు శంకరజయంతి ఉత్స వాల సందర్భంగా ఆదివారం వేదాంతం అనంతకృష్ణ ఆంజనేయశర్మ శాస్త్రీయ సంగీత విభావరి కార్యక్రమం జరిగింది. వేమూరి బాలకిష్ణమూర్తిచే శ్రీ పార్వతీకళ్యాణం హరికథ అందరిని ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో శంకరమఠం అద్యక్షులు కసవరాజు శ్రీనివాసశర్మ, కార్యదర్శి గణపతిరాజు మారు తిరామారావు, ఉపాద్యక్షులు టివిఎంఎన్ ప్రకాషరావు, కోశాధికారి కె.మదుసూధన్‌రావు, శంకరమఠం ప్రధాన అర్చకులు తెలికేపల్లి రామచంద్రయ్య, సహాయ అర్చకులు తెలికేపల్లి మల్లికార్జునలు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో ముత్తుస్వామి దీక్షితార్‌వారి కృతి శ్రీగణనాథం వినాయకం అనే కీర్తనతో కచ్చేరి ప్రారంభమైంది. ఆద్యాంతం అద్భుతంగా వివిధ కృతులతో స్రోతలను ఆనందింపచేశారు. వీరికి సహ కారవాద్యకారులుగా తిరుపతి ఎస్వీ మ్యూజిక్ కళాశాలనుంచి విచ్చేసి మృదంగం, వయోలిన్‌లతో వాద్యసహకారం అందించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

## ప్రకాశంజిల్లా ఎస్పీని కలిసిన సాయిప్రసాద్



**కావలిరూరల్, మే4 ప్రభాతవార్త** ప్రకాశంజిల్లా సింగరాయకొండలో నూతనంగా ఏర్పాటు అయిన కోర్టు ప్రారంభోత్సవానికి ఆదివారం ప్రకాశంజిల్లా ఎస్పీ ఈ.దామోదర్ విచ్చేసిన సందర్భంగా శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా ఎస్సీ అండ్ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఐ.సాయిప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలను ఆయనతో చర్చించడం జరిగింది.

## రావిగుంటపల్లిలో పిడుగుపాటుకు వ్యక్తి మృతి



**రావిగుంటపల్లి(రాపూరు), మే4ప్రభాతవార్త** రాపూరు మండలంలోని రావిగుంటపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం పిడుగుపాటుకు గురై తాటిబోయిన చిన్నయ్య(51), మృతి చెందాడు. మృతుడు గ్రామానికి సమీపంలోని అడవులలో గోర్రెలు మోపుతుండగా ఒక్కసారిగా వచ్చిన ఈదురుగాలులు, ఉరుములు, మేరుపులతో కూడిన గాలికి పిడుగుపడటంతో పిడుగుపాటుకు గురెనాడు. సహచర గోర్రెల కాపరుల సమాచారంతో చిన్నయ్య కుటుంబ సభ్యులు, సహచరులు అక్కడికి వెల్లి చూడగా చిన్నయ్య మృతి చెంది వున్నాడు. మృతునికి బార్య,కుమారుడు,కుమార్తె వున్నారు. నీరుపేద కుటుంబం అయిన మృతుని కటుంబాన్ని అదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## అలరించిన లవకుశ నృత్య రూపకం



**కోవూరు, మే 4 ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో వెలసి ఉన్న సత్యానంద ఆశ్రమంలో సాధు సత్పురుష సమాగం కార్యక్రమంలో భాగంగా విడవలూరు ఉన్నత పాఠశాలకు సంబంధించిన విద్యార్థులు ప్రదర్శించిన లవ కుశ నృత్య రూపకాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ సందర్భంగా లవుడు వేషధారి భావన్, కుశుడు వేషదారి రావుల ఆదర్శ్ , శ్రీరాముని పాత్రలో సీహెచ్ ప్రదీప్‌లు లవ కుశలోని శ్రీరామ స్తోత్రం, రాముని చరితము తెలిపే పాటలకు అభినీయ నృత్యరూపకం చేశారు. దాదాపు అరగంట పాటు వీరు ప్రదర్శించిన నృత్య రూపకాలకు భక్తులు పరవశించి పోయారు. ఈ సందర్భంగా భువనేశ్వరి పీఠాధిపతి శ్రీ కమలానంద భారత స్వామీజీ ఈ చిన్నారుల ప్రతిభను మెచ్చుకుని వారిని ప్రత్యేకంగా ఆశీర్వదించారు. ఉపాధ్యాయుడు పూడి వెంకట ప్రసాద్ ఈ విద్యార్థులకు నృత్య రూపకాన్ని తర్ఫీదు ఇచ్చి తన సొంత ఖర్చులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల ఆశ్రమ పీఠాధిపతి శ్రీహరి తీర్థస్వామి ప్రసాద్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం నృత్య రూపకం ప్రదర్శించిన చిన్నారులకు స్వామీజీ వస్త్రాలను అందజేశారు.

## తీరు మార్చుకుంటే మీకు మేలు



**కోవూరు, మే 4 ప్రభాతవార్త** : రౌడీలుగా, కేడీలుగా అనుమానితులుగా పోలీస్‌స్టేషన్‌లో రికార్డులకు ఎక్కిన వారు ఇకనైనా తమతీరు మార్చుకుని బుద్ధిగా మలుచుకోవాలని కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి అన్నారు. కోవూరు పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఆదివారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రౌడీ మేళా కార్యక్రమాన్ని నిర్వమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికైనా ఇటువంటి కేసుల్లో నిందితులుగా నమోదైన వారు తమ తీరు మార్చుకుని సత్ప్రవర్తనతో ముందుకు సాగాలన్నారు. మంచి ప్రవర్తనలో నడవకపోతే మీకే ఇబ్బంది అని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రంగనాథ్ గౌడ్, తదితరులు ఉన్నారు.

## నిరుపేదలకు వస్త్రాలు పంపిణీ




**( ఇనమడుగు కోవూరు, మే 4 ప్రభాతవార్త** : కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో వెలసి ఉన్న శ్రీ సత్యానంద ఆశ్రమంలో సాధు సత్పురుష సమాగం ఆదివారం పూర్తయింది. ఈ సందర్భంగా ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీహరి తీర్థస్వామి ఆధ్వర్యంలో ఇనమడుగు, చుట్టపక్కల గ్రామాల్లో ఉన్న పేదలకు 700 మందికి పైగా వస్త్రాలను పంపిణీ చేశారు. అనంతరం వారికి ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తమ తీర్థ స్వామీజీ, ఆశ్రమ కార్యదర్శి నాగేశ్వరరావు, రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

## పుస్తక పఠనానికి ప్రాధాన్యత ఇవ్వండి




**కోవూరు, మే 4 ప్రభాతవార్త :** సెల్‌ఫోన్ లోకం నుంచి బయటకు వచ్చి పుస్తక పఠనానికి విద్యార్థులు ప్రాధాన్యం ఇవ్వాలని గ్రంథాలయ బాండాగారి సురేంద్రరెడ్డి తెలిపారు. కోవూరులోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా పుస్తక పఠనం , తదితర అంశాలపై విద్యార్థులకు ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు పి. రంగారెడ్డి మాట్లాడుతూ వేసవి సందర్భంగా విద్యార్థులకు విజ్ఞానం పెంపొందించడానికి ఈ వేసవి శిక్షణా శిబిరాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం సమాజంలో ఎక్కువ మంది విద్యార్థులు తమ సమయాన్ని సెల్‌ఫోన్‌తో గడపడం మంచిది కాదన్నారు. దానిని విడనాడి గ్రంథాలయంలో ఉన్న పురాతన చరిత్రలు, మహనీయుల పుస్తకాలను అవగతం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. పిల్లల చేత డ్రాయింగ్ ప్రాక్టిస్ నిర్వహించారు.

## రైలు పట్టాల పైన దుర్గంధం



**బిట్రగుంట మే 4ప్రభాతవార్త** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని బిట్రగుంట రైల్వే స్టేషన్ సమీపంలో 143,144 ఎల్ సి గేట్లు సమీపంలో ఈనెల రెండవ తేదీ రాత్రి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఈ బర్రెలను ఢీకొట్టడం జరిగింది. అప్పటి నుండి న ఆ బర్రెల కాళేభరాలు ఎల్సీ గేటు 144 గేట్ వద్ద పడి ఉన్నాయి. వీటి గురించి ఏ ఒక్కరు గురించి ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. దీంతో గేటు ద్వారా ప్రయాణించాలంటే దుర్గంధంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే శాఖ అధికారులు వీటిపై చర్యలు తీసుకొని అక్కడ మృతి చెందిన బర్రెలను తొలగించాలని బోగోలు మండల ప్రజలు వేడుకుంటున్నారు.

## కండలేరులో45.094 టీయంసీల నిటిమట్టం

**కండలేరుడ్యాం(రాపూరు),మే5ప్రభాతవార్త** మండలంలోని కండలేరు జళాశయంలో ఆదివారం ఉదయం 6 గంటలకు 45.094 టీయంసీల నిటిమట్టం నమొదు అయినట్లు కండలేరు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. జళశయంనుండి అవుట్‌ఫ్లోగా హెడ్ రెగ్యులేటర్ నుండి 220 క్యూసెక్కులు,లో లెవల్ స్లూయిస్ ద్వారా 50 క్యూసెక్కులు,హైలెవల్ కెనాల్ ద్వారా 30 క్యూసెక్కుల చోప్పున మొత్తం 300 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఎఇ తిరుమలయ్య తెలిపారు.

# సజ్జన సాంఘత్యం అనేక మార్పులకు శ్రీకారం




**కోవూరు, మే 4 ప్రభాతవార్త** : సజ్జనతో చేసిన సాంఘత్యం ప్రతి ఒక్కరిలో ఒక మార్పు వచ్చి ముందుకు సాగేందుకు అవకాశం ఉంటుందని భువనేశ్వరి పీఠాధిపతి శ్రీ కమలానంద భారత స్వామీజీ తెలిపారు. కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో వెలసి ఉన్న శ్రీ సత్యానంద ఆశ్రమంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న పంచాహ్నిక వైదిక సాధు సత్పురుష సమాగం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మనసుని నిశ్చలంగా చేసుకుని ముందుకు సాగితే వారి వెనుక దేవుడు ముందు ప్రపంచం ఉంటుందన్నారు. ధర్మార్థ కామ మోక్షాలను త్యజించిన వాడే సర్వ సంఘ పరిత్యాగి అవుతారన్నారు. దైవ ఆరాధనతో దేవునిపై దృష్టి సారించి ముక్తి మార్గం వైపు ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలన్నారు. ఆది కావ్యం, రామాయణం, పట్ల ప్రాథమిక దశ నుంచి చిన్నారులకు అవగాహన కల్పించేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలన్నారు. గురువును పూజించిన పూజ ఇక ఏ పూజకు సాటిరాదన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో జీవన విధానం మారిపోయిందన్నారు. సంగీతం, సాహిత్యం ఇత్యాదివి గ్రామాల్లో కనుమరుగైపోయాయయన్నారు. దీంతో ఒకప్పుడు కలకలలాడిన గ్రామాలు ప్రస్తుతం కలాహీనంగా మారిపోయాయన్నారు. ప్రస్తుతం ధర్మంపై, మతంపై మతపరమైన దాడులు జరుగుతున్నాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని హిందువులంతా ఒక తాటిపై నడవాల్సి న సమయం ఆసన్నమైందన్నారు. జ్ఞానం ద్వారా ముక్తిని సంపాదించుకోవచ్చుని, గురువును మించిన దైవం ఈ సృష్టిలో లేదన్నారు. ఒకవైపు సత్యాన్ని అన్వేషిస్తూ త్యజించి ముక్తి సాధన వైపు దబుష్టి మరల్చాలన్నారు. సమాజానికి ఏదో చేయాలనే తపనతోనే మహాత్ములు ఉద్భవిస్తారన్నారు. ఈ ఐదు రోజుల పాటు జరిగిన ఈ సాధు సత్సంగ కార్యక్రమాల్లో భారతదేశం వ్యాప్తంగా అనేక ప్రాంతాల నుంచి వచ్చిన మఠాదిపతులు, పీఠాధిపతులు మతాజీల పాదధూళితో ఈ ఆశ్రమం పరమ పవిత్రంగా తయారైందన్నారు. శ్రీ సత్యానంద మహర్షి, రమణి మహర్షి ఆదేశానుసారం ఏర్పాటు చేసిన ఈ ఆశ్రమం ప్రస్తుతం 93 సంవత్సరాలు పూర్తయిందనానరు. రానున్న 7 సంవత్సరాల్లో ఈ ఆశ్రమంలో శత వార్షిక జయంతి వేడుకలు జరగనున్నాయన్నారు. సత్యానంద మహర్షి నాటిన ఈ వృక్షం ప్రస్తుతం శ్రీహరి తీర్థ స్వామి పర్యవేణలో శాఖోపశాఖలుగా మారి భారతదేశంలోని పలు ప్రధాన ప్రాంతాల్లో వ్యాపించిందన్నారు. ఈ కార్యక్రమంలో హరిద్వార్‌కు సంబంధించిన వివేకానంద గిరి మహరాజ్, రుషికేశ్‌కు సంబంధించిన శ్రీ కృష్ణానంద గిరీజీ మహరాజ్, శ్రీ పరమాత్మానాంద గిరి స్వామి, యోగిని చంద్రకాళి వరప్రసాద మాతాజీ , శ్రీ విశోక తీర్థ స్వాములు, జ్ఞాన చైతన్య సరస్వతి స్వామీ, రామకృష్ణ తీర్థ స్వామిలు పలు సూచనలు చేశారు. అనంతరం వందనం సమర్పణ కార్యక్రమాన్ని శ్రీమాన్ ఆశ్రమ కార్యదర్శి పోలుశెట్టి నాగేశ్వరరావు చేపట్టారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ముంబాయి తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## బుచ్చి బైపాస్ రోడ్డుకోసం బిజెపి నేతలు సంతకాల సేకరణ

### ఎంపికి బుచ్చికి బైపాస్ కావాలంటూ వినతి పత్రం ఇవ్వనున్న నేతలు



**బుచ్చి మే 4 ప్రభాతవార్త** బుచ్చి టౌన్‌లో రోజు రోజుకి ట్రాపిక్ పెరిగి పోతుందని, నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని అందువల్ల బుచ్చిరెడ్డిపాళెంకి బైపాస్ రోడ్డు కావాలని కోరుతు బుచ్చి నగర బిజెపి అధ్యక్షులు రామిశెట్టి కళ్యాణ్, కాసా శ్రీనివాసులు పలువురు బిజెపి నాయకులు సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతు బుచ్చిరెడ్డిపాళెంకి ముంబాయి రోడ్డుకి అనుసందానంగా బైపాస్ రోడ్డు చాలా కీలకమని అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంకి బైపాస్ రోడ్డు వేస్తే ట్రాపిక్ సమస్యల తగ్గడంతోపాటు బుచ్చిరెడ్డిపాళెం టౌన్ కూడా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. బైపాస్‌రోడ్డుకి సంతాల సేకరణ చేసి ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్ళనున్నట్లు తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం టౌన్‌కి బైపాస్ వస్తే టౌన్ తో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందుతాయని వారు తెలిపారు.

## కలెక్టరేట్‌లో ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు



**నెల్లూరు కలెక్టరేట్, మే 4, ప్రభాతవార్త** ఆదివారం కలెక్టర్ కార్యాలయంలోని శంకరన్ హాల్‌లో భగీరథ మహర్షి జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. డీ ఆర్ ఓ ఉదయభాస్కర్ రావు అద్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసిన నివల్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీ సీ వెల్ఫేర్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

## వార్డ్ ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీల ఆత్మీయ సమావేశం



**నెల్లూరు కలెక్టరేట్, మే 4, ప్రభాతవార్త** నెల్లూరు వార్డు ఎడ్యుకేషన్ మరియు డేటా ప్రాసెసింగ్ సెక్రటరీల ఆత్మీయ సమావేశం ఆదివారం నెల్లూరు నగరంలోని ఎన్జీవో హోమ్‌లో నిర్వహించారు. ఉద్యోగ నోటిఫికేషన్‌లో పొందుపరచిన విధంగా తమను టెక్నికల్ ఉద్యోగులుగా గుర్తించి అందుకు తగినట్లు పదోన్నతి కల్పించాలని ప్రభుత్వానికి వారు విన్నపించారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతి శర్మ, ఏపీ జేఏసీ జిల్లా కన్వీనర్, ఏపీ ఎన్జీవో జిల్లాప్రధాన కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతి శర్మ, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బాలరాగయ్య, ఏపీ ఎన్జీవో సిటీ ప్రెసిడెంట్‌రామ కృష్ణ రెడ్డి, జాయింట్ సెక్రటరీ చెంచయ్య ఈ సమావేశానికి హాజరై తమ మద్దతును తెలియజేశారు. ప్రభు త్వం విద్య కార్యదర్శుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి తగు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## తెల్లరాయి తరలింపుపై పోలీసులు దాడులు




**సైదాపురం, మే 4, ప్రభాతవార్త** మండల కేంద్రమైన సైదాపురంలోని ఓ యార్డు నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తెల్లరాయి ఖనిజం తరలించేందుకు లోడ్ చేస్తున్న వాహనాలపై పోలీసు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా శనివారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఒక క్రేన్, ఒక లారీని పట్టుకుని ఆరు మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై కాంతికుమార్ మాట్లాడుతూ సైదాపురంలోని తహశీల్దార్ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న ఓ యార్డు నుంచి ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి ఎటువంటి అనుమతులు లేకుండా ఆ యార్డులో ఉన్న తెల్లరాయిని బ్యాగ్‌ల్లోకి నింపి క్రేన్ సహాయంతో లారీకి లోడ్ చేస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు పోలీసు, మైనింగ్ శాఖలు కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ దాడుల్లో క్రేన్, ఓ లారీని పట్టుకుని ఆరు మంది వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఎవరైనా మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఖనిజం రవాణా చేస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

## ఘనంగా పీఠాధిపతులకు సన్మానం




కోవూరు, మే 4 ప్రభాతవార్త : కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో వెలసి ఉన్న శ్రీ సత్యానంద ఆశ్రమంలో పంచాహ్నిక వైదిక సాధు సత్పురుష సమాగం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆశ్రమ పీఠాధిపతి శ్రీహరి తీర్థ స్వాముల వారు 60 సంవత్సరాలు వయస్సు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన శిష్య బృందం స్వామివారిని భారీస్థాయిలో సత్కరించారు. అంతకుముందు సత్యానంద మహర్షి అధిష్టాన మందిరంలో స్వామివారి విగ్రహానికి రుత్వికుల మంత్రోచ్చారణల మధ్య పీఠాధిపతులు అభిషేక పూజలను నిర్వహించారు. అనంతరం ఈ సమాగంలో పాల్గొన్న మఠాధిపతులు, పీఠాధిపతులు అందరికీ సత్యానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీహరి తీర్థస్వామి హితోతికంగా సత్కార సన్మాన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సపందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం బృందంచే ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు సభను అలరించాయి.

– **ఆకట్టుకున్న కోలాటం నృత్యాలు** సత్యానంద ఆశ్రమంలో ఆదివారం ముగింపు సందర్భంగా బుచ్చి మండలం దామరమడుగు చెందిన కోలాటం బృందంచే చేపట్టిన నృత్య రూపకాలు భక్తులను ఎంతగానో అలరింపజేశాయి. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం బృందం వారు ఆలపించిన పలు గీతాలకు భక్తులు పరవశులై చేపట్టిన నృత్య రూపకాలు సభను అలరింపజేశాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ముంబాయి ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పాల్గొన్న వారికి ఆశ్రమం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

## అభివృద్దే నా లక్ష్యం.. ప్రతి ఇంటికి మంచినీరందిస్తా : మంత్రి నారాయణ



**నెల్లూరు, మే 4, ప్రభాత వార్త -వైద్యం** వైఎస్సా ర్ సీపీ అటకెక్కించిన అభివృద్ధి పనులన్నీ తిరిగి చేపడుతామని రాష్ట్ర పురపాలక, పట్టణా భివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని అభివృద్ధి పనులకు కాల పరిమితి పెట్టుకుని పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఆదివారం సాయంత్రం మంత్రి నారాయణ నగరంలోని 9,11,53 వ డివిజన్లలో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా 9వ డివిజన్ లో రెండు పార్కులు, 11వ డివిజన్ ఎన్‌టీఆర్ నగర్‌లో ఈఎల్ఎస్ఆర్ పార్కులను చిన్నారుల కేరింతలు, ఆనందోత్సహాల మధ్య ప్రారంభించారు. అనంతరం వెంకటేశ్వర పురంలో ఎన్టీఆర్ సుజల స్రవంతి మంచినీటి ప్లాంటును ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ పార్కులను అధునాతన వసతులతో ఆధునీకరించి వేసవి సెలవుల్లో చిన్నారులకు అంతు లేని ఆనందాన్ని సొంతం చేస్తున్నామన్నారు. అల్లీపురంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న లక్షల టన్నుల చెత్తను తొలగించి ఆ ప్రాంతాన్ని సుందర పార్కుగా అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే దొంతాలి ప్రాంతంలో వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. నగర ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తప్పనిసరిగా నెరవేరుస్తామన్నారు. అభివృద్ధి చెందాలంటే పరిశ్రమల ఏర్పాటు అత్యంత ఆవశ్యకమన్నారు. తద్వారా ఆదాయం సమకూర్చి అన్ని సంక్షేమ కార్యక్రమాలు చేసేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఇందుకుగాను అపార అనుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువ నేత లోకేష్‌బాబు, పారిశ్రామికవేత్తలను ఆహ్వానించేందుకు విశేషమైన కృషి చేస్తున్నారన్నారు. రాబోయే సంవత్సర కాలంలో నెల్లూరులోని ప్రతి ఇంటికి సంగం బ్యారేజీ నుండి మంచినీటిని అందిస్తామన్నారు. అదే విధంగా ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ద్వారా మూడు మదర్ ట్యాంకులు, 60 ట్యాంకులను నిర్మించామని అవసరమైతే మరో 60 ట్యాంకులను కూడా నిర్మిస్తామని పునరుద్ఘాటించారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం కేవలం రెండు రూపాయలకే 20 లీటర్ల మినరల్ ఆటర్‌ను అందిస్తామన్నారు. రాబోయే కొద్ది రోజుల్లో ఇంటి పట్టాలకు సంబంధించి భగత్ సింగ్ కాలనీ వారికి తీపి కబురు అందిస్తామన్నారు. గత ప్రభుత్వం వారసత్వంగా ఇచ్చిన రోట్ల రూపాయల అప్పునకు వడ్డీలు కడుతూ కూడా అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజల కలల రాజధాని అమరావతి నిర్మాణం రాబోయే మూడు సంవత్సరాలలో పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ కమీషనర్ నందన్, మాజీ మున్సిపల్ చైర్మన్ తాళ్లపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతా రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు, మున్సిపల్ ఇంజనీర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



## పురుషులతో సమానంగా మహిళలు క్రీడల్లో రాణించాలి: రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్ రావు




**వెంకటాచలం, మే 4, ప్రభాతవార్త:** పురుషులతో సమానంగా మహిళలు క్రీడా పోటీల్లో రానించి ఉన్నత స్థాయికి ఎదగాలని రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్ రావ్ పేర్కొన్నాబు. వెంకటాచలం మండల పరిదిలోని వెంకటాచలం మండలం కాకుటూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో జాతీయ అంతర్ యూనివర్సిటీ మహిళల సాఫ్ట్ బాల్ టోర్నమెంటు ముగింపు కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, విసి అల్లం శ్రీనివాస రావు పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక జాతీయ స్థాయి కార్యక్రమానికి రావడం చాలా ఆనందం కలిగించింది 29 రాష్ట్రాల నుంచి 60 యూనివర్సిటీలకు సంబంధించిన సాఫ్ట్ బాల్ జట్లు ఈ పోటీల్లో పాల్గొనడం సంతోషం నేనూ విద్యార్థి దశలో వాలీబాల్, కబడ్డీ క్రీడాకారుడిని. 15 ఏళ్ల వయస్సులో మా స్కూలు సాఫ్ట్ బాల్ జట్టులో ఒక క్రీడాకారుడు రాకపోవడంతో నాకు ఆడే అవకాశం ఇచ్చారు. 50 ఏళ్ల తర్వాత మళ్లీ ఈ రోజు విక్రమ సింహపురి యూనివర్సిటీలో సాఫ్ట్ బాల్ ఆడే అవకాశం లభించింది కొల్హాపుర్ శివాజీ యూనివర్సిటీ, పంజాబ్ లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సటీ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ కొల్హాపుర్ లోని శివాజి మొదటి స్థానంలో నిలిచింది రెండవ స్థానంలో పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంపీ మస్తాన్ రావు, యూనివర్సిటీ వీసీ అల్లం శ్రీనివాసరావు, పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ ఉమా, వి.ఎస్.యూ రిజిస్ట్రార్ సునీత, ప్రిన్సిపల్ విజయ తదితరులు

–క్రీడల అభివృద్ధికి కూటమి పెద్దపీట శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు క్రీడల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. కిక్రమసింహపురి యూనివర్సిటిలో జరుగతున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ మెన్ అండ్ ఉమెన్ టోర్నమెంటులో రవినాయుడు పాల్గొన్నారు. దేశంలోనే అత్యుత్తమంగా ఏపీ స్పోర్ట్స్ పాలసీని రూపొందించా మన్నారు. ప్రణాళికాబద్ధంగా స్పోర్ట్స్ పాలసీని అమలు చేస్తున్నామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించేలా క్రీడాప్రోత్సాహకాలు భారీగా పెంచడం జరిగింది. క్రీడల పట్ల సీఎం చంద్రబాబు నాయుడు, విద్యా శాఖామంత్రి నారా లోకేష్ గారు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్టార్ సునీత, యూనివర్సిటి సిబ్బంది జిల్లా లోని క్రీడా అధికారులు రాజకీయ ప్రతినిధులు పాల్గొన్నారు.




## వైసిపి నేత శ్రీనివాసులరెడ్డిని పరామర్శించిన ప్రసన్నకుమార్‌రెడ్డి



**బుచ్చి మే 4 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని దామరమడుగు గ్రామంలో సీనియర్ వైసిపి నాయకులు పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి మెదడు సంబందింత వ్యాధితో చికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకొని దామరమడుగు ఆర్ఆర్ కాలనీలో వారి నివాసానికి వెళ్లి వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిది ,రాష్ట్ర పిఎసి సభ్యులు నల్లపరెడ్డిప్రసన్నకుమార్‌రెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల పార్టీ అద్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి, కలువ బాలశంకర్‌రెడ్డి, మన్యం నాగేంద్ర, స్దానిక వైసిపి నాయకులున్నారు.

## కామాక్షితాయిని దర్శించుకున్న బ్రహ్మోత్సవ సేవా కమీటి



**బుచ్చి మే 4 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి, కామాక్షితాయి బ్రహ్మోత్సవాల సందర్బంగా ఏర్పాటు చేసిన బ్రహ్మోత్సవ సేవా కమీటి సభ్యులు ఆదివారం నాడు అమ్మవారిని, స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ఇఒ ఆర్వభూమి శ్రీనివాసులురెడ్డి వారిని స్వాగతించి స్వామి అమ్మవార్ల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సేవా కమీటి వారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో సేవా కమీటి సభ్యులు తిరువూరు అశోక్‌రెడ్డి, కనపర్తి నాగేంద్ర, నక్కల శివకృష్ణ, తిరువాయి పాటి నందకుమార్, ముంగర సుధాకర్, శ్రీశైల శశిశేఖర్ శర్మ ( అర్చక) పాలూరు చాముండేశ్వరీ ,కొల్లపూడి శారద, పెన్నతూరు సుమలత, గంద్రకోట రమాదేవి, జొన్నలగడ్డ వరలక్ష్మీ ఇమ్మడిశెట్టి సౌజన్యలక్ష్మీ సభ్యులుగా ఉన్నారు. మే 17 నుండి 27 వరకు జరగనున్న అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలలో సేవాలు అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

## ప్రభుత్వ ఆదేశాలతో రేషన్ కార్డులు మంజూరు : తహసిల్దార్



**కొడవలూరు, మే 4, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు లేని వారి కోసం త్వరలోనే రేషన్ నమోదు ఆన్లైన్ విడుదల చేయనున్నదని తహసిల్దార్ స్ఫూర్తి రెడ్డి ఒక ప్రకటన తెలిపారు. మండలంలో రేషన్ కార్డు లేనివారు, తప్పిదాల ఉన్నవారు నమోదు చేసుకోవాలని తదుపరి రేషన్ కార్డుల మంజూరు చేయడం జరుగుతుందన్నారు.